

రంజాన్ వేళలు

ఇఫ్తార్ - మంగళవారం
సాయంత్రం - 6.31

సహర్ - బుధవారం
ఉదయం - 5.04

కీసరగుట్టపై క్షేత్ర దిగ్బలి

పూర్ణాహుతితో ముగిసిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



కీసరగుట్టలో క్షేత్రబలి నిర్వహిస్తున్న అర్చకులు

కీసర, మార్చి 11: కీసరగుట్టపై మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు ఆరోరోజు పూర్ణాహుతితో ముగిశాయి. ఆలయ చైర్మన్ తటాకం నాగ లింగం శర్మ, ఈవో నరేందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకుడు బలరాంశర్మ, అర్చకులు ఎమ్మెల్యే మల్లారెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, అర్చకులు మహామండపంలో శాలువతో సత్కరించి, ఆశీర్వచనలు అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. వైదిక కార్యక్రమాలు, పూజలు నిర్వహించగా, ఆలయంపై ఎలాంటి దుష్టశక్తులు ప్రవేశించకుండా శాస్త్రోక్తంగా క్షేత్ర దిగ్బలి చేశారు. డప్పుద రువులతో వరిఅన్నం వేసుకుంటూ క్షేత్రం చుట్టూ బలి పూజలు నిర్వహించారు. అదే విధంగా బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణ ద్వారా ముక్కోటి దేవతలను ఆహ్వానించి, సంతృప్తి పరిచి పూర్ణాహుతితో వీడ్కోలు పలికారు. అనంతరం వేద పాఠశాల పండితుడు గణపతిశర్మ, విద్యార్థులకు ఆలయ నిర్వాహకులు సన్మానం చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ పూస వెంకటేష్, ఎంపీపీ మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ, సహకారసంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, ఆలయఫౌండర్ సభ్యులు తటాకం నారాయణ శర్మ, తటాకం రమేష్ శర్మ, ఉమాపతి శర్మ, వెంకటేష్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ, ఫౌండర్ ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

నేటి నుంచే రంజాన్

ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. సోమవారం నెలవంక దర్శనంతో రాత్రి ఇషా నమాజ్ తర్వాత ప్రత్యేక ప్రార్థనలు(తరావీ) చేశారు. మంగళవారం నుంచి నెల రోజుల పాటు ఉపవాస దీక్ష(రోజా) పాటించనున్నారు. రంజాన్ సందర్భంగా జిల్లాలోని మసీదులను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. కర్జురాలు, ఇతర పండ్లు విక్రయించే దుకాణాలు వెలిశాయి. హలీం తయారీ ప్రారంభమైంది.

- మేడ్చల్ టౌన్ మార్చి 11



విద్యుత్ వెలుగుల్లో మేడ్చల్ పెద్ద మసీదు

వసూళ్లకు రహదారి!

- లారీలు, వ్యాపారుల నుంచి ముక్కుపిండి వసూళ్లు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- పరిగి కేంద్రంగా అక్రమ రవాణా

అది.. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి.. బెంగళూరు-ముంబై, బీజాపూర్ జాతీయ రహదారులకు లింక్ రోడ్డు.. అక్రమ రవాణాకు ఈ దారి కేంద్రంగా మారింది. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన ఆ శాఖ అధికారులు ఈ మార్గంలోని పరిగి పట్టణాన్ని తమ వ్యక్తిగత ఆదాయ వనరులుగా మలచుకొని వసూలు రాజాలుగా మారారు.



మామూళ్ల మత్తులో కమర్షియల్ ట్యాక్స్ అధికారులు

పరిగి, మార్చి11 : ముంబయి-హైదరాబాద్, బెంగళూరు, బీజాపూర్ ప్రాంతాలకు వివిధ వస్తువులను తరలించేందుకు సదాశివపేట్, షాద్‌నగర్, గుల్బర్గా ప్రాంతాలకు లింక్‌హైవేగా పరిగి పట్టణం మీదుగా నిత్యం వందలాది లారీలు రాకపోకలు జరుగుతుంటాయి. అయితే పరిగి పరిసరాల్లో చెక్ పోస్టులు లేకపోవడంతో దీన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు ఇక్కడి నుంచి రవాణా చేసేందుకు ఎంచుకున్నారు. దీనిని అదనుగా చేసుకుని సేల్స్ అండ్ కమర్షియక్ ట్యాక్స్ అధికారులు కొన్ని నెలలుగా పరిగిని అడ్డాగా మార్చుకున్నారు. అక్రమంగా వస్తువులను తరలిస్తున్న లారీలను ఆపి ముక్కుపిండి వసూళ్లకు పాల్పడుతున్నారు. వ్యాపార మాఫీయాలతో అధికారులు కుమ్మక్కై లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. స్టీల్, ఇసుక, పత్తి, మొక్కజొన్న, కందులు, రేషన్ బియ్యం తదితర రకాల వస్తువుల రవాణ చేసే అక్రమార్కులతో చేతులు కలిపి కలెక్షన్ కింగ్‌లుగా మారుతున్నారు.

అడ్డాగా మారిన పరిగి...

పరిగి పట్టణం మీదుగా ప్రతి రోజు రాత్రి సమయంలో వందలారీల్లో ద్వారా వివిధ రకాల సరుకుల అక్రమ రవాణా జరుగుతోంది. అయితే వీటిలో 100 నుంచి 150 లారీల వరకు ఏలాంటి వే బిల్‌సేల్స్ ట్యాక్స్‌లు చెల్లించకుండా అధికారులకు మామూళ్లు ఇచ్చి రవాణ చేస్తున్నారు. దీంతో ఆ శాఖ అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై స్టీల్, వాణిజ్య పంటలు, చెక్కర, జొన్నలు, టేకు, ఎర్రచందనం,గంధం చెక్కలలాంటి వాటిని స్మగ్లింగ్ చేస్తున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతిరోజూ రాత్రి పరిగి పట్టణంలోని కొడంగల్ చౌరస్తాలో వాహనాలను ఆపి అందిన కాడికి దండుకుంటున్నారు. ఏదైనా వస్తువును తరలించే విలువలో స్థానిక మార్కెట్ కమిటీకి ఒక శాతం, వాణిజ్య పన్నుల శాఖకు రెండు శాతం పన్ను చెల్లించాలనేది నిబంధన. అయితే ఈ నిబంధనల ప్రకారం ధాన్యం, ఇతర వస్తువుల విలువను బట్టి ఒక్కోలారీకి రూ.25 నుంచి రూ.35 వేల వరకు ఫీజును వసూలు చేయాల్సి ఉంటుంది. ఇలా ఏ వస్తువునైనా తరలించేందుకు వే బిల్‌తో పాటు, సేల్ ట్యాక్స్ చెల్లించి రవాణా చేయాలి. కానీ ఈ నిబంధనలను పక్కన బెట్టి సంబంధిత అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడి, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ప్రభుత్వానికి పన్నుగా ఇచ్చే దాని కంటే తక్కువ ఇవ్వమని చెప్పి మరీ వసూలు చేస్తున్నారు. ఈ విధంగా నిత్యం పరిగి కేంద్రంగా లక్షల రూపాయలను వసూలు చేస్తున్నారు. గతంలో ప్రత్యేకంగా బృందంగా వచ్చిన అధికారులు పరిగి శివార్లలోని స్టీల్‌కంపెనీలు, రైస్ మిల్లులపై దాడులు నిర్వహించి లక్షల రూపాయలు వసూలు చేసుకుని పోయినట్లు సమాచారం.



పరిగిలో లారీని ఆపి రమ్మంటున్న కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు చెందిన వ్యక్తి (ఫైల్)

భారీగా స్టీల్ జీరో దందా...

పరిగి సబ్ డివిజన్ పరిధిలోని పరిగి, చిట్యాల్, సోమన్‌గుర్తి, రాకంచర్ల ప్రాంతాల్లో స్టీల్ కంపెనీలున్నాయి. ఈ పరిశ్రమల నుంచి నిత్యం దాదాపుగా వెయ్యి టన్నుల వరకు స్టీల్ ఉత్పత్తి అవుతుందని అంచనా. అయితే ఇందులో 50 శాతానికి పైగా జీరో దందా జరుగుతుందనేది సేల్స్ అండ్ కమర్షియల్ శాఖ అధికారులకు తెలుసు. దీంతో ఎంత మెటీరియల్ తరలించినా ఎవరూ పట్టించుకోరు. ఈ స్టీల్ కంపెనీల ద్వారా సంబంధిత శాఖ అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అధికారులు చూసిచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. స్పెషల్ పార్టీ అధికారులు వచ్చినప్పుడు, స్థానికంగా విధులు నిర్వహిస్తున్న అధికారులు ముందుగానే వారికి సమాచారం ఇస్తారు. దీంతో పరిశ్రమల యాజమాన్యాలు అప్రమత్తమై ఆరోజు బిల్లులతో రవాణ చేస్తుంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజూ లక్షల్లో పన్ను ఎగవేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి జీరో మెటీరియల్ రవాణపై నిఘా పెట్టాలని వ్యాపార రంగనిపుణులు పేర్కొంటున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి11 : మహిళలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోఅంతర్జాతీయ మహిళా దినం సందర్భంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. లింగవివక్షత లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ పూనుకోవాలన్నారు. మహిళలు తలచుకుంటే ఏదైనా అవలీలగా చేయగలరని, అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకు దూసుకెళ్లగలరని అభినందించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, ఇతర ఉద్యోగులు మహిళా నవ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జ్యోతి పద్మ, వెంకటేశం, సుధారాణి, మల్లేశం, రవికుమార్, దీపారెడ్డి, సుగుణ, ఉపేందర్, డీఎస్‌వో జ్ఞానేశ్వర్, మాధవి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనాల పనులు పూర్తి చేయాలి

జిల్లాలో గ్రామ పంచాయతీ బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తి చేసి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధింత అధికారులకు నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈనెల 15 వరకు పెండింగ్ పనులనుపూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో సీసీ రోడ్లకు మంజూరైన నిధులతో అంచనాలను రూపొందించుకొంటూ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీఆ పనులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు, డీఈలు, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు అవిశ్వాస గండం?

» పావులు కదుపుతున్న కాంగ్రెస్ నేతలు

» 16 మంది కౌన్సిలర్లతో అవిశ్వాసానికి రంగం సిద్ధం



మేడ్చల్‌టౌన్, మార్చి 11 : బీఆర్ఎస్ పార్టీకి చెందిన మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపి కనర్సింహారెడ్డిపై అవిశ్వాసానికి కౌన్సిలర్లు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. పదవిని కాపాడు కోవటానికి రెండు నెలలుగా చైర్‌పర్సన్ చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టే పరిస్థితులు కనబడుతున్నాయి. అధికారంలో ఉన్ననాటి నుంచి సొంత పార్టీ కౌన్సిలర్లతో ఉన్న ముప్పుకు ఉప్పందించే విధంగా ఒక వైపు కాంగ్రెస్ పార్టీ నేతలు పావులు కదుపుతుండటంతో అవిశ్వాస వ్యవహారం తిరిగి మరోసారి తెరపైకొచ్చింది. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డికి నమ్మిన బంటుగా ఉన్న మేడ్చల్ చైర్‌పర్సన్ భర్త మర్రి నర్సింహారెడ్డిని రాజకీయంగా దెబ్బ కొట్టటానికి కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టార్గెట్ చేశారు. విషయం గమనించిన చైర్‌పర్సన్ కుర్చీ కాపాడుకోవటానికి కౌన్సిలర్లను దుబాయి, గోవా విహార యాత్రలకు పంపించారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న రాజకీయ సమీకరణలతో మేడ్చల్ మున్సిపల్ పీఠాన్ని వదలబోమంటూ అధికారపార్టీ నేతలు వ్యూహానికి పదును పెడుతున్నారు. మొత్తం 23 మంది కౌన్సిలర్లు ఉండగా, వారిలో ఇద్దరు కాంగ్రెస్, ఒకరు బీజేపీ, మిగితా వారు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉన్నారు. కాగా ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి చెందిన 18వ వార్డు కౌన్సిలర్ భవానీరాఘవేందర్‌ను చైర్‌పర్సన్ చేయటానికి కాంగ్రెస్ నాయకులు పావులు కదుపుతున్నారు.

రహస్య మంతనాలు

అవిశ్వాసం పెట్టడానికి ఇప్పటికే కొందరు కౌన్సిలర్లు రహస్యంగా సమావేశాలు జరుపుకుంటున్నారు. ఈమేరకు సోమవారం ఓ రహస్య ప్రదేశంలో 16 మంది కౌన్సిలర్లతో కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త రాఘవేందర్ సమావేశం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్‌ను అక్కడికి పిలిచి కౌన్సిలర్లతో చర్చలు జరిపినట్లు ప్రచారం ఊపందుకుంది. కాగా ఆరునెలల పదవీ కాలానికి తిప్పలు ఎందుకంటూ కొందరు కౌన్సిలర్లు తమ అభిప్రాయాన్ని తెలిపినప్పటికీ కాంగ్రెస్ నేతలు ససేమిరా అన్నట్లు తెలిసింది. అధికార కాంగ్రెస్ పార్టీలో చేరదలచిన కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం వైపు అత్యధికంగా మొగ్గు చూపుతున్నారు. ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లతో కలిపి ఇంకా 14 మంది మద్దతు కూడగట్టుకుంటే చైర్‌పర్సన్ పదవి దక్కించు కోవచ్చన యోచనలో కాంగ్రెస నేతలు కనబడుతున్నారు.



కాంగ్రెస్‌లోకి వచ్చేవారిని క్యాష్ చేసుకునే దిశలో..

అధికార కాంగ్రెస్ పార్టీలో చేరదలచుకునే బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు బేషరతుగా అవిశ్వాసానికి అంగీకరించాలన్న ప్రతిపాదన కాంగ్రెస్‌పెద్దలు పెట్టినట్లు తెలిసింది. ప్రస్తుతం చాలా మంది కౌన్సిలర్లు పార్టీ మారేయోచనలో ఉన్నారు. దీంతో వారు బేషరతుగా అవిశ్వాసానికి మద్దతుఇస్తున్నట్లు కచ్చితమైన హామీ ఇచ్చిన తర్వాతనే పార్టీలో చేరాలంటూ కాంగ్రెస్ పెద్దలు సూచించినట్లు తెలిసింది. దీంతో కొందరు కౌన్సిలర్లు అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

» పార్టీని గెలిపించండి.. కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటాం

» జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

చేవెళ్ల, మార్చి 11: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని వికారాబాద్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశం కేజీఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన కార్యకర్తలున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసే బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. సీనియర్ నాయకులు కోరడంతోనే తాను బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరానని చెప్పారు. నిత్యం పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, భీంభరత్ మాట్లాడుతూ చేవెళ్లగడ్డ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ జెండా ఎగరవేయాలన్నారు. చేవెళ్ల ప్రాంతానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి పనులు ప్రారంభించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే కష్టపడ్డారో అంతకు మించి ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సూచించారు. అనంతరం వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి సమక్షంలో మొయినాబాద్, నవాబ్‌పేట్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, టీపీసీసీ కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, దేవర వెంకటరెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, సీనియర్ నాయకులు సున్నపు వసంతం, షాబాద్ దర్శన్, బల్వంత్‌రెడ్డి, వనం లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్, శ్రీనివాస్, కుంచం శివకుమార్‌గుప్తా, పాండుగౌడ్, సత్యనారాయణ, మధుసూదన్ గుప్తా, శ్రీకాంత్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సునీతామహేందర్‌రెడ్డి

ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే

తాండూరు: మార్చి 11: తాండూరు మున్సిపల్ పరిధిలో మైనార్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్‌లను పంపిణీ చేశారు. వైట్ ప్యాలెస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి , మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, నిర్వాహకులు ముజీబ్ పాల్గొన్నారు.

పాంబండ పెద్ద జాతరలో కొబ్బరికాయల విక్రయానికి వేలం

కులకచర్ల, మార్చి 11: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పాంబండ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పెద్ద జాతర సందర్భంగా కొబ్బరి కాయల విక్రయానికి మంగళవారం దేవాలయం ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సమ్మ రాములు, ఏవో సుధాకర్ తెలిపారు. గతంలో వాయిదా పడిన కొబ్బరి కాయల వేలం పాటను మళ్లీ నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పొందిన వారు పాంబండ పెద్ద జాతర సందర్భంగా మార్చి 30 నుంచి ఏప్రిల్ 9 వరకు కొబ్బరి కాయలు విక్రయించేందుకు వీలుంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా డిపాజిట్ చేయాలన్నారు.

మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్‌గా హన్మంతు



నియామకపత్రం అందుకుంటున్న హన్మంతు

కొడంగల్ రూరల్, మార్చి 11: మత్స్యశాఖ వికారాబాద్ జిల్లా డైరెక్టర్‌గా కొడంగల్ మండలంలోని పెద్దనందిగామ గ్రామానికి చెందిన కె.హన్మంతు ఎన్నికయ్యారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన చైర్మన్, డైరెక్టర్‌ల ఎన్నికలో సోమవారం ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్ ధ్యేయం

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్
- కడ్తాల్‌లో ప్రజా పాలన యాత్ర


కడ్తాల నుంచి మైసిగండికి పాదయాత్రగా వెళ్తున్న సంపత్ కుమార్, నాయకులు, కార్యకర్తలు

కడ్తాల్, మార్చి 11 : సామాజిక న్యాయం, సమానత్వం కాంగ్రెస్ ప్రజా పాలన ధ్యేయం అని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. లోక్‌సభఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి ఢిల్లీలో అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజులు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని 'రేవంతన్నకు దండుగా.. ప్రజా పాలనకు అండగా..'అనే కార్యక్రమాన్ని సోమవారం సంపత్‌కుమార్ కడ్తాలలో నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక నాయకులతో కలిసి పాదయాత్రగా మైసిగండికి చేరుకొని మైసమ్మ ఆలయాన్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీజేపీ మత రాజకీయాలు చేస్తోందన్నారు. బీజేపీకి ప్రజలు బుద్ధిచెప్పే సమయం ఆసన్నమైందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ నియంతృత్వం, అవినీతి పాలనకు ప్రజలు చరమగీతం పాడినట్టే బీజేపీని సైతం ఇంటికి పంపుతారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజల ఆకాంక్షల మేరకు పాలన సాగిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పోటీ చేసేందుకు అభ్యర్థులే కరువయ్యారని సంపత్ కుమార్ ఎద్దేవా చేశారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగేనన్నారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ లోక్‌సభా స్థానాల్లో కాంగ్రెస్ విజయం తథ్యం అన్నారు. నాగర్‌కర్నూల్ రిజర్వ్‌డ్ స్థానం నుంచి దరఖాస్తు చేసుకున్న 26మందిలో కాంగ్రెస్ టికెట్ ఎవరికి వచ్చినా మిగతా వాతంతా పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ.. బీజేపీ విచ్ఛిన్నకర, విద్వేష పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమం లో పీసీసీ సభ్యుడు ఐళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జగన్, ఎంపీపీలు కమ్లీమోత్యా, అనితవిజయ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బిచ్యానాయక్, జగన్, డి.ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్,ఎం.అంజయ్యగుప్తా, లక్ష్మణ్, జహంగీర్ అలీ, రాంచందర్, కృష్ణ, శేఖర్‌గౌడ్, శంకర్, లక్ష్మయ్య, జవహర్‌లాల్, సురేశ్, హీరాసింగ్, పి.శ్రీశైలం, రామకృష్ణ, ఎం.మల్లేశ్‌గౌడ్, తులసీరామ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి


మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, ఎంపీడీవో, తహసీల్దార్ తదితరులు

యాచారం, మార్చి 11 : రోజురోజుకూ ఎండలు ముదురుతున్న నేపథ్యంలో బోర్లలో నీరు అడుగంటుతోందని, ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఎండల తీవ్రత దృష్ట్యా నీటి సరఫరాను మరింత పెంచాలని ఎంపీపీ ఆర్‌డబ్ల్యూస్, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాను మరింత పెంచాలని కోరుతూ కలెక్టర్, జెడ్పీ సీఈవో, సంబంధిత శాఖల అధికారులను కోరుతాం అన్నారు. గ్రామాల్లో పశువుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి తొట్లలో 24 గంటలూ నీటిని ఉంచాలని ఎంపీపీ పంచాయతీ అధికారులను ఆదేశించారు. గత వానకాలంలో వర్షాలు సరిగా పడనందున మూగ జీవాలకు చెరువుల్లో నీరు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎండ కాలంలో మూగ జీవుల కోసం నీటిని ఏర్పాటు చేయడం మనందరి బాధ్యతన్నారు. యాసంగిలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామని ఏవో సందీప్ కుమార్ సభ్యులకు తెలిపారు. మల్చింగ్‌తో పంటలు సాగు చేసుకోవాలని డివిజనల్ ఉద్యాన అధికారి కనకమహాలక్ష్మి రైతులకు సూచించారు. ఆయిల్ పామ్ మొక్కల పెంపకానికి 90శాతం సబ్సిడీ ఉందని ఆమె తెలిపారు. 234 పశువులకు కృత్రిమ గర్భధారణ చేశామని వెటర్నరీ డాక్టర్ రేఖ తెలిపారు. అలాగే మండలంలో 1,064 పశువులకు నట్టల నివారణ మందు వేశామన్నారు. నెల రోజుల్లో 9,653 మంది ఔట్ అండ్ ఇన్ పేషెంట్లకు సేవలందించామని డాక్టర్ రాజ్యలక్ష్మి చెప్పారు. టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఎంఈవో వెంకట్‌రెడ్డి చెప్పారు. 804సంఘాలకు బ్యాంక్‌లింకేజీతో రూ.42.32కోట్ల రుణాలిచ్చే లక్ష్యాన్ని పెట్టుకున్నామని ఐకేపీ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి చెప్పారు. ఉపాధి కూలీలకు పనులు కల్పిస్తున్నామని ఏపీఎం లింగయ్య తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కేవలం ఎన్నికలపైనే విపక్షాల దృష్టి : కొండా


శంకర్‌పల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, మార్చి 11: బీజేపీ దృష్టి ఎప్పుడూ దేశాభివృద్ధిపై ఉంటుందని, కానీ విపక్షాల ధ్యాస మాత్రం ఎప్పుడూ ఓట్లు సీట్లపై ఉంటుందని చేవెళ్ల మాజీ ఎంపీ, వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వారితో ఆయన మాట్లాడుతూ కేవలం ఎన్నికల కోసం బీజేపీ పనిచేయదని, దేశాభివృద్ధే పార్టీ లక్ష్యం అన్నారు. పేదల అభ్యున్నతికి పాటుపడేది బీజేపీ మాత్రమే అన్నారు. కానీ విపక్షాలు మాత్రం ఎన్నికల్లో ఓట్ల కోసమే రాజకీయాలు చేస్తాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ పేరు మార్మోగుతోందన్నారు. ఓ సర్వేలో అమెరికా, బ్రిటన్, జపాన్, జర్మనీ దేశాధినేతలను తోసిరాజని అత్యంత ప్రజాదరణ ఉన్న నేతగా మోదీ గుర్తింపు పొందారన్నారు. బీఆర్ఎస్ పాలకులు రాష్ట్ర ధనాన్నంతా కాళేశ్వరంలో కుమ్మరించారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలంతా పనిచేయాలన్నారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, మహిళామోర్చా అధ్యక్షరాలు గాయత్రి, విశ్వారెడ్డి, రాజకుమార్, రాజాచంద్ర, రాజేంద్రసింగ్ పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలి


వినతిపత్రాన్ని ఎస్బీఐ గేట్‌కు అతికిస్తున్న నాయకులు

పరిగి, మార్చి 11 : ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య అన్నారు. రాజకీయ పార్టీల చందాలకు సంబంధించిన ఎలక్టోరల్ బాండ్లను రద్దు చేస్తూ బాండ్ల వివరాలు సుప్రీం కోర్టుకు, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు మార్చి 13 కల్లా అందజేయాలని సుప్రీం కోర్టు ఆదేశించినా బీజేపీ ఒత్తిడితో ఎస్బీఐ ఇప్పటి వరకు వివరాలు ఇవ్వడం లేదన్నారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పరిగిలో ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ధర్నా చేశారు. వినతిపత్రాన్ని మేనేజర్ తీసుకోకపోవడంతో గేట్‌కు అతికించారు. నాయకులు మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని 2018, ఏప్రిల్ 18న బీజేపీ ప్రభుత్వం తెచ్చిందన్నారు. రాజకీయ పార్టీలకు విరాళాలు నేరుగా ఎస్బీఐలో జమ చేసే విధానమే ఇదన్నారు. దీనిపై నల్లధనం, తెల్లధనం అనే వివరాలు అడగరన్నారు. రాజకీయ పార్టీల విరాళాలపై సమాచారం ఇవ్వకపోవడం సరికాదన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను వెంటనే అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు హబీబ్, సత్తయ్య, యాదగిరి, రఘురామ్, చెన్నారెడ్డి, కృష్ణ, రాంరెడ్డి, అమీర్ పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష


అధికారులు, ముస్లిం ప్రతినిధులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: మార్చి 11 : రంజాన్ మాసం ఏర్పాట్లపై సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పలు శాఖల అధికారులు, ముస్లిం ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. మసీదులకు, గృహాలకు తాగు నీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడాలన్నారు. మున్సిపల్ కార్మికులు మసీదుల వద్ద ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అందరూ స్నేహ భావంతో పండుగ జరుపుకోవాలని మనోహర్‌రెడ్డి అన్నారు. పండుగను ప్రశాంతంగా జరుపుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రమసింహారెడ్డి, సీఐ సంతోష్‌కుమార్, ముజీబ్, యూసుఫ్, అబ్దుల్‌రవూఫ్, కౌన్సిలర్ నీరజ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని ఆలయ భూముల కొలతలు


ఆలయ భూములను పరిశీలిస్తున్న సర్వేయర్లు, గ్రామస్తులు

కడ్తాల్, మార్చి 11 : కడ్తాలలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ భూములు కబ్జా అవుతున్నాయని గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆలయ భూమిని పరిశీలించిన అధికారులు భూమి సరిహద్దులను తేల్చలేదని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆలయానికి 41ఎకరాల భూమి ఉందని, సర్వే నంబర్120లో 15.31 ఎకరాల హద్దులు నిర్ధారించేందుకు జాప్యం ఎందుకు చేస్తున్నారని సర్వే అధికారులపై మండిపడుతున్నారు. సోమవారం సర్వే అధికారులు డీఐ కృష్ణయ్య, సర్వేయర్ పాండురంగారెడ్డి వచ్చిన సర్వేను మరోసారి వాయిదా వేయడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 120సర్వేనంబర్ భూమికి వెంటనే హద్దులు పాతాలని డిమాండ్ చేస్తున్నారు. ఆలస్యం అయితే ఉన్న భూమిని కూడా కబ్జా చేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో మోహన్‌రావు, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహ్మారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, కమిటీ సభ్యులు గూడూరు జంగారెడ్డి, సాయిరెడ్డి, టీక్‌లాల్, బిక్యానాయక్, అర్చకులు శ్రీధర్, పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి సేవలందించిన గొప్ప వ్యక్తి జగ్జీవన్ రామ్ : మంద కృష్ణ



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంద కృష్ణ

మేడ్చల్ టౌన్, మార్చి 11 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డబిల్‌పూర్‌లో నెలకొల్పిన బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రజలకు సేవలందించి గొప్ప వ్యక్తి జగ్జీవన్‌రామ్ అన్నారు. ఆయన్ను రాబోయే తరాలు గుర్తుంచుకునేందుకే గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. వర్గీకరణ సాధన ఉద్యమం నిరుపేద దళితుల కోసం నిరంతం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రజితారెడ్డి, మాజీ సర్పంచ్ గీతారెడ్డి, నాయకులు రాజమల్లారెడ్డి, బాబుల్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం!

బషీరాబాద్, మార్చి 11 : కంసాన్‌పల్లి(ఎం)లో అంగన్‌వాడీ భవనం అసంపూర్తి మిగిగిపోయింది. అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేక చిన్నారులను స్థానిక పాఠశాల ఆవరణలో కూర్చోబెడుతున్నారు. ఐదేళ్ల కింద రూ.7లక్షలతో మొదలుపెట్టిన భవనాన్ని కాంట్రాక్టర్ స్లాబ్ వేసి వదిలేశాడు. అధికారులూ పట్టించుకోవడం లేదు.స్లాబ్ వరకే బిల్లు వచ్చిందని కాంట్రాక్టర్ అంటున్నాడు. అధికారులు నిర్మాణాన్ని పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా శివగంగ రాజరాజేశ్వరాలయ రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

మహేశ్వరం, మార్చి 11 : మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరాలయంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి రుద్రహోమం, రథోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి స్వామి వారి రథాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. యువకులు పోటీపడి రథాన్ని లాగారు. వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఐదు రోజులు వైభవోపేతంగా సాగిన బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి లలిత సహస్రపారాయణం, దోపోత్సవంతో ముగిశాయి. ఆలయ కమిటీ చైర్మన్ అల్లెకుమార్ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్.సునీత, మాజీ చైర్మన్లు కూన యాదయ్య, కాకి ఈశ్వర్, సుధీర్‌గౌడ్, పోతర్ల సుదర్శన్, నవీన్, కుమార్, డైరెక్టర్లు రాకేష్, జగన్, సాయిలు, కన్నయ్య, శ్రీశైలం, నాయకులు పూర్ణచంద్రారెడ్డి, ఆనందం, సూర్యనారాయణరెడ్డి, జి.జంగయ్య, భిక్షపతి, సత్యనారాయణ, కె.చందు, యాదయ్యగౌడ్, మల్లేష్, మైసయ్య, శ్రీకాంత్, ఆలయ ఈవో మురళీకృష్ణ, ఆలయ ప్రధానార్చకులు వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో ఈటల రాజేందర్ బైక్ ర్యాలీ


బైక్ నడుపుతున్న మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

ఘట్‌కేసర్, మార్చి 11 : ఘట్‌కేసర్‌లో మల్కాజిగిరి లోక్‌సభ ఎంపీ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో బోడుప్పల్‌లోని మల్లన్నగుడి నుంచి ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు 100 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఈటల రాజేందర్ బైక్ నడిపారు. బైక్ ర్యాలీ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, విక్రంరెడ్డి, హనుమాన్, మోహన్‌రెడ్డి, సురేష్, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి ఘటనపై విచారణ జరుపుతున్నాం : ఆర్డీవో


రికార్డు విభాగంలో వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

కొందుర్గు, మార్చి, 11 : విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన హరీశ్వర్‌రెడ్డి(ఆర్మీ జవాన్ అశోక్‌రెడ్డి అన్న) తన భూమికి సంబంధించిన ఆర్వోఆర్, పహాణీల గురించి దరఖాస్తు చేయగా రికార్డు అసిస్టెంట్ బాల్‌రాజ్, మరో ప్రైవేట్ వ్యక్తి డబ్బులు తీసుకున్న సంఘటనపై విచారణ చేపడుతున్నామని షాద్‌నగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటమాధవరావు తెలిపారు. సోమవారం కొందుర్గు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. కార్యాలయ గదులను, రికార్డు విభాగాన్ని పరిశీలించారు. వివరాలను డిప్యూటీ తహశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడారు. ఆర్వోఆర్, పహాణీల కోసం తహసీల్దార్ కార్యాలయంలోనే రైతులు దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వీటి జిరాక్స్ పత్రాలివ్వడానికి నెల రోజుల సమయం పడుతుందని ఆర్డీవో తేల్చి చెప్పారు. మరి కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తిని ఎందుకు పెట్టుకున్నారని విలేకరులు ప్రశ్నించగా, ఇప్పటికే కార్యాలయంలో ముగ్గురు రికార్డు అసిస్టెంట్లు ఉన్నారని, ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకోవాల్సిన అవసరమే లేదన్నారు. ప్రస్తుతం శ్రీనివాస్ రికార్డు విభాగాన్ని చూస్తున్నారని తహసీల్దార్ రమేష్‌కుమార్ తెలిపారు. దరఖాస్తుదారు హరీశ్వర్‌రెడ్డితో మాట్లాడతానని ఆర్డీవో చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిన సంతాపూర్ ఎంపీటీసీ


ఎంపీటీసీ రాజుకు కాంగ్రెస్ కుండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కేశంపేట, మార్చి 11 : గతంలో కాంగ్రెస్‌లో ఉన్న సంతాపూర్ ఎంపీటీసీ రాజు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేష్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్వారి జగదీశ్వర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌ను ముమ్మరం చేసింది. మండలంలో మెజారిటీ ఎంపీటీసీ సభ్యులను కాంగ్రెస్‌లో చేర్చుకునే చర్యలను చేపట్టింది. కాంగ్రెస్‌పై అభిమానం ఉన్నవారిని మొదటగా చేర్చుకునే ప్రణాళిక రూపొందిస్తోంది. మండలంలో 12 ఎంపీటీసీలకు కేశంపేట ఎంపీటీసీ యాదయ్య ఎన్నికల ఖర్చు చూపకపోవడంతో అనర్హతకు గురయ్యాడు. మిగతా 11 మందిలో ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట, వేముల్‌నర్వ మినహా 8 మంది ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం అయినట్టు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ నాయకత్వం ఎంపీటీసీలను పార్టీలో చేర్చుకునేందుకు చర్యలను ముమ్మరం చేసింది. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఎంపీటీలు ఓటు హక్కు వినియోగించుకుంటారు.

స్టేజీల వద్ద బస్సులు ఆపడం లేదని మహిళల నిరసన


తొండపల్లిలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

పరిగి, మార్చి 11 : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు నుంచి బస్సులను స్టేజీల వద్ద సరిగ్గా నిలపడం లేదని సోమవారం తొండపల్లిలో మహిళలు రోడ్డుపై ఆందోళన చేశారు. ఆర్టీసీ సిబ్బంది, అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిగి-షాద్‌నగర్ రోడ్డుపై బైఠాయించారు. ఉచిత రవాణ కల్పిస్తున్నప్పటి నుంచే బస్సులు ఆపడం లేదన్నారు. గంటకుపైగా నిరసన చేపట్టడంతో వాహనాల రాకపోకలు నిలిచాయి. దీంతో పోలీసులు వచ్చి ఆర్టీసీ డీఎంతో మాట్లాడారు. బస్సులు నిలుపుతామని ఆయన చెప్పడంతో ఆందోళనను విరమించారు.

జైపూర్ కాళ్ల అమరిక క్యాంపునకు స్పందన



తాండూరులో జైపూర్ కాళ్లను అమరుస్తున్న నిపుణులు

తాండూరు: మార్చి 11: అఖిల భారత, మర్వాడి యువమంచ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కృతిమ కాళ్ల అమరిక శిబిరాన్ని ఆర్బీఎల్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. బాలాజీ మందిరంలో నిర్వహించిన ఈ క్యాంప్‌లో మొదటిరోజు వంద మందికి పైగా వికలాంగుల కొలతలను సేకరించారు. ఈనెల 13,14 తేదీల్లో కృతిమ కాళ్లను, క్యాలిఫర్స్‌ను అందించనున్నట్లు మర్వాడి యువ మంచ్ ప్రతినిధి మన్మోహన్ సారాడా తెలిపారు. ఈక్యాంప్‌నకు వికారాబాద్ జిల్లా వాసులతో పాటు కర్ణాటకలోని చించోలి, సేడం, గుల్బర్గా నుంచి దివ్యాంగులు వచ్చారు. ఈ కార్యక్రమంలో మంచ్ ప్రతినిధులు మురళీధర్ గగ్రాని, మోహన్ పాల్గొన్నారు. క్యాంప్‌కు మర్వాడి యువ మంచ్‌తో పాటు ఆర్బీఎల్ కర్మాగారం సహకారం అందించింది.

గ్రామాలకు 'భగీరథ' నీరు అందడం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

ధారూరు, మార్చి 11: గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందడంలేదని మండల సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాయంలో సోమవారం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పి.బసప్ప, మున్నూర్ సోమారం ఎంపీటీసీలు మాట్లాడుతూ.. రెండు, మూడు రోజులకోసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారని, అధికారులను అడిగితే పై నుంచే సరఫరా కావడం లేదని చెప్పి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. పైపులైన్‌లు లీకేజీలతో తాగునీరు కాలనీలకు సరిగ్గా సరఫరా కావటంలేదన్నారు. వీటిని ఎవరు సరిచేస్తారని ప్రశ్నించారు. గట్టెపల్లిలోని ఎస్సీకాలనీలో తాగునీటి పైపులైన్ లేక తాగునీటికి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ సభ దృష్టికి తెచ్చారు. నాటిన మొక్కలను నీళ్లు పోయక ఎండిపోతున్నాయని ఆయన తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా గ్రామాల్లోని పైపులను మరమ్మతు చేసి సింగిల్ ఫేజ్ మోటారును బిగించాలని సభ్యులు కోరారు. గ్రామాల్లో పర్యటించి తాగునీటి పైపులైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయిస్తామని ఎంపీడీవో నర్సింహులు తెలిపారు. మండలంలో రూ.2.50కోట్లతో ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తిచేశామని పీఆర్ఏఈ ప్రణీత్ తెలిపారు. కాగా విద్యాశాఖ, ఐసీడీఎస్, అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. కొన్నిశాఖల అధికారులు తమ అసిస్టెంట్‌లను పంపించడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎంపీపీ విజయలక్ష్మి మాట్లాడుతూ అధికారులు సమావేశాలకు తప్పని సరిగా వచ్చి ప్రజాప్రతినిధులు చేప్పే సమస్యలను విని పరిష్కరించాలని అన్నారు. కాగా సర్పంచుల పదవీకాలం ముగియడంతో సమస్యలపై ప్రశ్నించేవారు కరువయ్యారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్, తహసీల్దార్ సాజీదా బేగం, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాయకుడిగా కాదు సేవకుడిగా పనిచేస్తా



పెద్దేముల్: సమావేశంలో పార్టీకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

పెద్దేముల్, మార్చి 11: ప్రజలకు సేవచేయడంలో తాను నాయకుడిగా కాకుండా ఒక సేవకుడిగా పనిచేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మంబాపూర్, కందనెల్లి, గాజీపూర్, పెద్దేముల్, రుద్రారం, ఇందూర్, బుద్దారం తదితర గ్రామాల నుంచి సుమారు 270మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 100 రోజుల కాంగ్రెస్‌పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులు చూసి పెద్దఎత్తున పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో గ్రూపులకు తావు ఇవ్వమని స్పష్టం చేశారు. పాత, కొత్త అనే తేడాలు రాకుండా అందరూ పార్టీకోసం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అందరూ తాండూరు అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. గత ప్రభుత్వం కోట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టుల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. 9200 ఎకరాలకు సాగునీరివ్వాల్సిన కోట్‌పల్లి ప్రాజెక్టు మూన్నాలుగు వేలకు కూడా సక్రమంగా నీరందించలేకపోతోందని అన్నారు. తమ ప్రభుత్వంలో ఆయకట్టు చివరి వరకూ నీరందిస్తామన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా గెలుపు కాంగ్రెస్‌దే కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ ధారాసింగ్, మండల అధ్యక్షుడు గోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు నల్ల ఎల్లారెడ్డి, జితేందర్ రెడ్డి, సాయిని నారాయణరెడ్డి, సాయిని శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పరిమల్లేశం, మైనార్టీ కన్వీనర్ రియాజ్, కోఆప్షన్‌సభ్యులు నసీర్, గాజీపూర్ నారాయణరెడ్డి, డీవై.నర్సింహులు, ఇందూరు ప్రకాష్, అంజిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణిలో 77 దరఖాస్తులు



దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

మేడ్చల్ టౌన్ మార్చి 11: మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్వో హరిప్రియ 77 దరఖాస్తును స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సంబంధితశాఖల అధికారులకు అప్పగించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

మల్లన్న ఆలయంలో ఈటల పూజలు



మల్లన్నను దర్శించుకున్న ఈటల రాజేందర్

మేడ్చల్‌టౌన్, మార్చి 11: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో రెండు రోజుల పాటు నిర్వహించే మల్లన్న జాతరలో బీజేపీ నాయకులు ఈటల రాజేందర్ సోమవారం పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. జాతర రెండవ రోజు ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకోవటానికి డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలు విచ్చేసి తీర్థప్రసాదాలు పుచ్చుకున్నారు. మండలంలోని గ్రామాల ప్రజలతో పాటు, నగరం నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

ఈటలను కలిసిన బీజేపీ రాష్ట్ర నాయకుడు

మేడ్చల్ టౌన్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను బీజేపీ రాష్ట్ర ఎస్సీసెల్ అధికార ప్రతినిధి భట్టు నాగేశ్వరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పూడూరు గ్రామ శివార్లలోని రింగ్‌రోడ్డు వద్ద ఉన్న ఈటల నివాసానికి భట్టు నాగేశ్వర్‌రావు పలువురు ఎస్సీ సెల్ బీజేపీ నేతలతో వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ఈటలకు శాలువాకప్పి సన్మానించి ఆయన విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సీఐటీయూ నిరసన



తాండూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల నిరసన

తాండూరు: మార్చి 11: గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) తాండూరు శాఖ ఆధ్వర్యంలో తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, బుగ్గప్ప మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు ఐదు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో మల్టీపర్పస్ వర్కర్స్ విధానంతో ఉద్యోగ భద్రతను కోల్పోయారని అన్నారు. జీవో 51 సవరించాలని డిమాండ్ చేశారు.

వైద్యశాస్త్రంలో మెకానికల్ ఇంజనీర్లకు ఉపాధి అవకాశాలు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 11: వైద్యశాస్త్రంలో మెకానికల్ ఇంజనీర్లకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అనురాగ్ యూనివర్సిటీ మెకానికల్ విభాగం హెచ్‌వోడీ శ్రీనివాస చలపతి అన్నారు. మండలంలోని అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో మెకానికల్ ఇంజనీర్ల అవశ్యకత గురించి వివరించారు. ఈ అవకాశాన్ని మెకానికల్ ఇంజనీర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తిచేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సరిత, నీరజ, అరుణ్‌రెడ్డి, రాజ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వాలి

కొడంగల్, మార్చి 11: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు కర్మాని సాయిలు డిమాండ్ చేశారు. కొడంగల్‌లో కడా కార్యాలయం ఎదుట సోమవారం పంచాయతీ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అదేవిధంగా కార్మికులకు పర్మినెంట్ చేస్తూ మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సమానపనికి సమాన వేతనం అందించాలని, కారోబార్ బిల్‌కలెక్టర్‌లను సహాయక కార్యదర్శులుగా నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయిదాస్, దస్తప్ప, సుమిత్ర, వెంకటమ్మ, సావిత్ర, అన్యానాయక్, నారాయణ, సాయిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

అనారోగ్యంతో రిటైర్డ్ హెచ్‌ఎం మృతి



శ్యామ్‌రావు(ఫైల్)

కొడంగల్ రూరల్, మార్చి 11: మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం శ్యామ్‌రావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. అంత్యక్రియలు మంగళవారం సొంత గ్రామం టేకుల్‌కోడ్‌లో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రంజాన్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మేడ్చల్ టౌన్: పీస్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

మేడ్చల్ టౌన్, మార్చి 11: నెలరోజుల పాటు కొనసాగే రంజాన్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలని మేడ్చల్ సీఐ సత్యనారాయణ అన్నారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మసీదుల నిర్వాహకులు, ముస్లిం పెద్దలతో పీస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రంజాన్ ఉపవాస దీక్షలు చేపట్టే ముస్లింలకు ఇబ్బందులు కలగకుండా భద్రత కల్పిస్తామన్నారు. దీక్ష విరమణ అనంతరం ముస్లిం యువకులు ఆలస్యంగా రాత్రివేళ వాహనాలపై తిరగరాదన్నారు. జాతీయ రహదారి వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నందున రోడ్డు ప్రమాదాలు జరిగే వీలుందన్నారు. యువకులు జాతీయ రహదారిపై రంజాన్ సందర్భంగా బైక్‌రైడ్‌లు చేయరాదన్నారు. అవసరం ఉన్న మసీదుల వద్ద భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. మసీదుల నిర్వాహకులు ఈ విషయంలో పోలీసులకు సహకరించాలన్నారు. శాంతి భద్రతల విషయంలో మసీదుల వద్ద ఏమైనా సమస్యలుంటే ముందుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మురళీధర్, మసీదుల నిర్వాహకులు, ఇమామ్‌లు, ముస్లింపెద్దలు పాల్గొన్నారు.

మసీదులో నెలరోజులు సహెర్ ఏర్పాట్లు

మేడ్చల్‌లోని హజరత్ జిందాషా మదార్ దర్గా మసీదులో రంజాన్ సందర్భంగా నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టే వారి కోసం సహెర్ ఏర్పాటు చేస్తున్నట్లు మసీదు అధ్యక్షుడు సయ్యద్ లాయక్ అలీ తెలిపారు. దీక్ష చేపట్టే వారికి తెల్లవారుజామున ఉచితంగా భోజన వసతి కల్పించాలన్న ఉద్దేశ్యంతో గ్రామానికి చెందిన పలువురు పెద్దల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. స్థానికంగా రాత్రివేళ ఉద్యోగాలు చేసుకునేవారు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులు, జాతీయ రహదారిపై నుంచి వెళ్లే వారితో పాటు ఇళ్లలో సహర్ చేయలేని వారి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్: ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ముస్లింలతో పీఎస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు సోదరులు, ఎస్ఐలు శేఖర్, శ్రీకాంత్, పోలీసుసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్



మేడ్చల్ టౌన్: ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మేడ్చల్ టౌన్, మార్చి 11: అధికారంలోకి రాక ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాటను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ కార్మికులకు 22శాతం పీఆర్సీ ప్రకటించిన నేపథ్యంలో సోమవారం మేడ్చల్ ఆర్టీసీ డిపోలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు కాంగ్రెస్ నేతలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, దాత్రిక లింగం, పోచయ్య, సురేందర్ ముదిరాజ్, సత్యనారాయణ, రాఘవేందర్ గౌడ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

శామీర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు 21శాతం పీఆర్సీ అమలుచేయాలని నిర్ణయం తీసుకోవడంతో సోమవారం హకీంపేట ఆర్టీసీ డిపో వద్ద క్షీరాభిషేకం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు జరిగిన పాలాభిషేకంలో నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. సంవత్సరానికి సుమారు రూ.418కోట్ల అదనపు భారం ఖజానాపై పడుతున్నా సీఎం రేవంత్ రెడ్డి వెనుకంజ వేయలేదని తెలిపారు. రాష్ట్రంలో 53,071మంది ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేయాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, బ్లాక్, వార్డు, మున్సిపల్ నాయకులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



ఘట్‌కేసర్‌లోని ఈడబ్ల్యుఎస్ కాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని

ఘట్‌కేసర్, మార్చి 11: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రణలోకి వస్తాయని ఘట్ కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో సోమవారం రూ.20లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఘట్‌కేసర్‌లో మున్సిపాలిటీ నిధుల నుంచి 80 సీసీకెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు. డీఐ శ్రీనివాస్, ఎస్ఐ రాము, వైస్ చైర్మన్ పల్లుల మాధవరెడ్డి, కమిషనర్ సాబేర్ అలీ, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, ఆంజనేయులు, నస్రీన్ సుల్తానా, నగజ్యోతి, రవీందర్, జహంగీర్, నర్సింగ్‌రావు, నాయకులు శ్రీనివాస్ గౌడ్, గోపాల్‌రెడ్డి, హరిశంకర్, పద్మ పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

వికారాబాద్, మార్చి 11: మహిళలు స్వశక్తితో ఎదగాలని చేవెళ్ల మాజీ ఎంపీ, బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. వికారాబాద్ సత్య భారతి ఫంక్షన్ హాల్‌లో బుధవారం రుద్రమదేవి ఫౌండేసన్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంలో ఎంపిక చేయబడిన 800 మంది మహిళలతో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశాన్ని పదో స్థానం నుంచి ఐదో స్థానానికి తీసుకొచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రామ దేవి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు రుద్రమదేవి, సీని నటి యాంకర్ ఝాన్సీ, మాజీ జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డి, లావణ్య రెడ్డి, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **కొడంగల్ రూరల్:** స్థానిక వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వరలక్ష్మీ దాంపత్య వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 10గంటలకు గ్రామంలోని పలువురు దంపతులు ఆలయంలో వ్రతం నిర్వహించారు.

● **ఘట్‌కేసర్:** ప్రత్యేకాధికారులు ప్రజా సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని చౌదరిగూడ ఎంపీటీసీ పులకంటి భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం పంచాయతీ పరిధిలోని పలు కాలనీలో పర్యటించి సమస్యలను వివరించారు. ప్రధానంగా మురుగు నీటి సమస్య, దోమలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్న అధికారులు కనీసచర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మక్త గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద మురుగునీరు మ్యాన్‌హోల్ నుంచి బయటకు రావడం వల్ల విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు.

● **మోమిన్‌పేట్:** కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు సుభాష్‌గౌడ్ అన్నారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు.

● **తాండూరు రూరల్:** తాండూరు ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎండీ మినాజొద్దీన్ అన్నారు. ఉద్దండాపూర్‌లో సోమవారం ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. మినాజుద్దీన్ మాట్లాడుతూ గ్రామంలోని కుర్వ గోపాల్ ఇంటి నుంచి పాఠశాల వరకు సీసీరోడ్డు వేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ-కర్ణాటక సరిద్దులోని ఉద్దండాపూర్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు.

● **వికారాబాద్:** యాదాద్రి లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయ సన్నిధిలో దళితుడైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను అలాగే బీసీ అయిన మహిళ మంత్రి కొండ సురేఖను నేలపై కూర్చోబెట్టి అవమాన పర్చడాన్ని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ దళిత నాయకుడు టైగర్ బి.కృష్ణయ్య ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

● **పూడూరు:** సోమన్‌గుర్తిలో నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ నిర్మాణం కోసం తమ వంతు సాయంగా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పెంటయ్య రూ.51వేలు విరాళం అందజేశారు. సోమవారం ఆట్టి నగదును నిర్వాహకులకు అందజేశారు. అదేవిధంగా తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గోపాల్ తనవంతుగా ఆలయ నిర్మాణానికి రూ.21వేలు అందించారు. కార్యక్రమంలో శివారెడ్డి, వెంకటేష్, నారాయణ, నిర్వాహకులు పాల్గొన్నారు.

● **పూడూరు:** మండలంలోని సోమన్‌గుర్తికి చెందిన సాయి అనే వ్యక్తి కొన్ని నెలల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. ఆయన మృతితో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పెంటయ్య రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

● **బషీరాబాద్:** సీనియర్ నేత, బీఆర్ఎస్ నాయకులు బుస్సా శంకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వికారాబాద్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన పార్టీ సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి హాజరవగా ఆమె సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. అంతకుముందు శంకర్‌రెడ్డి తాండూరులో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కలువగా పార్టీలోకి స్వాగతించినట్లు ఆయన తెలిపారు.

● **తాండూరు:** రాజకీయాలతో సంబంధం లేకుండా సాగుతున్న గోశాలలోనూ రాజకీయాలు చేస్తున్నారని ఇందూర్ ఎంపీటీసీ పటేల్ ప్రవీణ్ కుమార్, బీజేపీ నియోజకవర్గ నాయకులు రజనీకాంత్ అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గోశాలలో ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించి హిందూ సంస్థలు చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు.

● **శామీర్‌పేట:** శ్రీమల్లిఖార్జున స్వామి జాతర సోమవారం మాజీ సర్పంచ్ గుర్క కుమార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అలియాబాద్‌లోని మల్లిఖార్జున స్వామి జాతరను భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామివారి కల్యాణం నిర్వహించి అగ్నిగుండాలు తొక్కారు. సాయంత్రం బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

● **పెద్దేముల్:** తమ భూమి తమకు తెలియకుండానే ఇతరుల పేరుపై పట్టా అయిందని కందనెల్లికి చెందిన మహబూబ్ కుటుంబం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగింది. సర్వేనెంబర్ 243లో మూడు ఎకరాల మూడు గుంటల భూమి ఉండేదని, 2007లో అదే గ్రామానికి చెందిన నర్సప్ప, మొగులప్పకు సాదా బైనామా కింద అధికారులు పట్టా చేశారని తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు.

క్రైం కార్నర్

యువకుడి దారుణ హత్య

కీసర రూరల్, మార్చి 11: చిన్నపాటి గొడవ ఓ యువకుడి హత్యకు దారితీసింది. ఈ ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కరీంగూడ గ్రామంలో సర్ ఫీడ్ సెంటర్ ప్రైవేట్ కంపెనీకి చెందిన కోళ్ల ఫారం కొనసాగుతుంది. అందులో ఒరిస్సాలోని కందమని జిల్లాకు చెందిన బబ్లూ(26), కబీర్‌చంద్ర ప్రధాన్‌లు పనిచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. కాగా ఆదివారం ఉదయం కోడిపిల్లల తరలింపు విషయంలో ఇద్దరూ గొడవపడ్డారు. దీన్ని మనసులో పెట్టుకున్న కబీర్‌చంద్ర ప్రధాన్ అదేరోజు రాత్రి తిరిగి బబ్లూతో గొడవపడ్డాడు. మాటామాటా పెరిగి ఆవేశానికి గురైన కబీర్‌చంద్ర ప్రధాన్ బబ్లూను కత్తితో పొట్టలో పొడిచాడు. గమనించిన స్థానికులు ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. బబ్లూ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొడంగల్ రూరల్, మార్చి 11: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కొడంగల్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొడంగల్ మండలంలోని నాజ్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి(40) సోమవారం గ్రామం నుంచి పనినిమిత్తం కొడంగల్‌కు వచ్చాడు. ఈక్రమంలో తిరుగు ప్రయాణంలో వెళ్తుండగా కొడంగల్‌లోని మన గ్రోమోర్ ఫర్టిలైజర్స్ దుకాణం వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టగా రాజశేఖర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యాలాల: మార్చి 11: మండల కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాలాల బస్టాండ్ సమీపంలో గల వ్యవసాయ పొలంలో చింత చెట్టు కింద మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా మృతుడి వయసు సుమారు 45 నుంచి 50మధ్య ఉంటుందని అంచనా వేశారు. అతడి శరీరం పూర్తిగా కాలిపోయి ఉందని చెప్పారు. ఈమేరకు మృతదేహాన్ని తాండూరు పోస్టుమార్టం తరలించి భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు

బషీరాబాద్, మార్చి 11: అక్రమంగా ఇసుక తరలించేందుకు వాగువద్ద ఉన్న ఓ ట్రాక్టర్‌ను బషీరాబాద్ పోలీసులు సోమవారం పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎక్మాయి గ్రామానికి చెందిన సుంకరి రామేష్ ఇసుకను తరలించేందుకు ఆదివారం రాత్రి వాగుకు వెళ్లగా పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడికి వెళ్లేలోగా రెండు ట్రాక్టర్లతో డ్రైవర్లు దొరకకుండా పారిపోయారు. అక్కడున్న ఓ ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

నవాల్గలో హోటల్ దగ్ధం

● ఉపాధి కోల్పోయిన దివ్యాంగుడి కుటుంబం

బషీరాబాద్, మార్చి 11: నవాల్గలోని మహేందర్‌రెడ్డి కాలనీలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఓ హోటల్‌లో మంటలు చెలరేగి ఓ దివ్యాంగుడి కుటుంబం ఉపాధి కోల్పోయింది. ఈ ఘటన బషీరాబాద్ మండలం నవాల్గ గ్రామం మహేందర్‌రెడ్డి కాలనీలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నరేందర్ (దివ్యాంగుడు) తన భార్య రాములమ్మతో కలిసి కట్టెల షెడ్డులో హోటల్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి అక్కడే తన సోదరి ఇంట్లో కుటుంబంతో కలిసి నిద్రిస్తుండగా పక్కనే ఉన్న హోటల్‌కు మంటలు ఉవ్వెత్తున చెలరేగాయి. చుట్టూ పొగలు వ్యాపించడంతో సమీప ఇళ్ల ప్రజలు బయటకు వచ్చి దివ్యాంగుడిని అప్రమత్తం చేసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే హోటల్ పూర్తిగా మంటలో దగ్ధమైంది. అందులోని ఇతర సామగ్రి పూర్తిగా మంటల్లో దగ్ధమయ్యాయి. బాధితుడు బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించాడు. ఎవరో కావాలనే తన హోటల్‌కు నిప్పుపెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు. బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని వికలాంగుల సంఘం బషీరాబాద్ మండల అధ్యక్షుడు చెరుకు రాజు గౌడ్ ఒక ప్రకటనలో కోరారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు నాలుగేళ్ల జైలు


మేడ్చల్ టౌన్ మార్చి 11: చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు మేడ్చల్ అసిస్టెంట్ స్పెషల్ జడ్జి, కోర్టు న్యాయాధికారి నాలుగేళ్ల శిక్ష విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో 150చోరీ చేసిన కేసుల్లో జీత్‌రాజ్‌పాల్‌సింగ్, మర్‌సింగ్ జగ్గార్, లక్కీసింగ్ గబ్బర్‌సింగ్ టాక్, విశాంత్ నవ్వారేలు ముద్దాయిలుగా ఉన్నారు. మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడి ఆయుధాలతో నగరంలోని జీడిమెట్లలో ఓపాత ఇంట్లో తలదాచుకోగా పోలీసులు వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. నిందితులపై విచారణ జరిపిన అనంతరం న్యాయాధికారి వారికి నాలుగేళ్ల కారాగార శిక్షను విధించినట్లు అడిషనల్ ప్రాసిక్యూటర్ తెలిపారు.

ఫేస్‌బుక్‌లో వడ్డీలేని రుణమంటూ మోసం

పెద్దేముల్, మార్చి 11: ఫేస్‌బుక్‌లో వడ్డీలేని రుణం ఇప్పిస్తామని వచ్చిన ప్రకటనను నమ్మి మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు మోసపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన మెహరాజ్ చిన్న హోటల్ నడుపుతున్నాడు. ఫేస్‌బుక్‌లో వడ్డీలేని రుణం ఇస్తామని ఓ ప్రకటన వచ్చింది. అది నిజమేనని నమ్మిన మెహరాజ్ ఆ లింక్‌ను క్లిక్ చేయగా రూ.2లక్షలకు అర్హుడయ్యావంటూ చూపింది. అందుకు మొదటగా రూ.1750, ఆతర్వాత ఇన్సూరెన్స్ అంటూ రూ.3,550, ఎన్‌ఓసీ అని రూ.5550 వసూలు చేశారు చివరగా రూ.9600కడితే డబ్బులు వేస్తామని చెప్పారు. అనుమానం వచ్చిన మెహరాజ్ వారిని నిలదీయడంతో అర్ధాంతరంగా ఫోన్‌కట్ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


మురుగు తొలగింపునకు చర్యలు



మురుగును తొలగిస్తున్న సిబ్బంది

తాండూరు, మార్చి 11: ఈనెల 5వ తేదీన 'మున్సిపాలిటీ ముందే మురుగు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. మురుగును తొలగించి దుర్వాసన రాకుండా చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీ జేసీబీతో సోమవారం తాత్కాలికంగా మురుగు కాల్వను ఏర్పాటు చేశారు. దీంతో విలియమూన్ చౌరస్తా నుంచి తాత్కాలికంగా మురుగు కాల్వ (మోరీ) ను ఏర్పాటు చేసి రోడ్డుపై మురుగు నీరు పారకుండా చేశారు. అధికారులు శాశ్వత ప్రతిపాదకన మురుగు కాల్వ నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నట్లు సూచించారు.

నాలాలు మాయంపై కదలిక!



నాలాను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ ఉషారాణి, ఏఈ పరమేష్

ఘట్‌కేసర్, మార్చి 11 : 'నాలాలు మాయం' అంటు ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారుల్లో కదలిక వచ్చింది. ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించారు. ఘట్‌కేసర్ మండల పరిధిలోని చౌదరిగూడ పంచాయతీ జోడిమెట్ల వద్ద నాలాను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని ఇరిగేషన్ డీఈ ఉషారాణి, ఏఈ పరమేష్ పరిశీలించారు. హైదరాబాద్ -వరంగల్ జాతీయ రహదారికి అనుకొని నాలాకు అడ్డంగా భవనం నిర్మాణ చేపట్టారు. దీంతో వానాకాలంలో వరద ప్రవాహం నిలిచిపోయే ప్రమాద మున్నందున నిర్మాణదారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. నాలాలు, బఫర్ జోన్ల వద్ద నిర్మాణాలు చేపట్టె ముందు ఇరిగేషన్ శాఖ నుంచి తప్పనిసరిగా ఎన్‌వోసీ తీసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.